## లక్ష్మీనర్సింహస్వామి సేవలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



ఆలయంలో ఎమ్మెల్సీ రాజు, ఎమ్మెల్యే వివేకానందకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి సేవలో ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ పాల్గొని తరించారు. ఆదివారం కొండపైకి చేరుకున్న వారు స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

## కొనుగోలు కేంద్రంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి పరిశీలన



మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్, ఏప్రిల్ 27 : చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోలు తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ ప్రాంగణంలో ధాన్యం ఆరబోయడానికి కాంక్రీట్ పనులు చేయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట తాసీల్దార్ హరికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ హనుమంతరావు
- పీఏసీఎస్ సీఈఓలకు షోకాజ్ నోటీసులు



జలాల్‌పూర్‌లో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 27 : ధాన్యం కొనుగోళ్లలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. మండలంలోని జూలూరు, పోచంపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు చేయడం లేదని, తాగునీటి వసతి కల్పించడం లేదని రైతులు తెలిపారు. తాగునీటి వసతి కల్పించాలని, దాతల సహకారంతో మజ్జిగ ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. జిల్లాలో 372 కొనుగోలు కేంద్రాలకు గాను 30 కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. జూలూరు, బీబీనగర్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు చేయడం లేదని, హమాలీలను ఏర్పాటు చేయకపోవడంతో పీఏసీఎస్ సీఈఓలకు షోకాజ్ నోటీస్ అందించామని తెలిపారు. అకాల వర్షంతో చౌటుప్పల్, నారాయణపురం, భూదాన్ పోచంపల్లిలో కొంత మేర ధాన్యం తడిసిందన్నారు. మిల్లర్లు వెంటనే ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని సూచించారు. అనంతరం వంకమామిడి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. హార్వెస్టర్‌లో పడి చేయి కట్ అయిన ఇరుకు శివకు న్యాయం జరిగేటట్లు చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్, ఏఓ శైలజ, ఆర్‌ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, ఏఎస్ఓ రోజా, డీటీసీఎస్ బాలమణి, పోచంపల్లి పీఏసీఎస్ సీఈఓ బాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



పల్లెపహాడ్ కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

తుర్కపల్లి, ఏప్రిల్ 27 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, ఎప్పటికప్పుడు లారీల్లో మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని మాదాపురం, పల్లెపహాడ్, పెద్దతండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లు తనిఖీ చేసి కొనుగోళ్లు ఏ విధంగా జరుగుతున్నాయని తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు.

ఆయన వెంట తాసీల్దార్ దేశ్యా, అధికారులు, రైతులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రంలో డీఏఓ ఆకస్మిక తనిఖీ



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

బొమ్మలరామారం, ఏప్రిల్ 27 : మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని తీసుకు రావాలన్నారు. దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై అభ్యంతరాలు ఉంటే రైతులు తనకు నేరుగా ఫోన్‌లో తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్.దుర్గేశ్వరి, ఏఈఓ వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

## గౌడ యువజన సంఘం అమ్మనబోలు నూతన కమిటీ



గౌడ యువజన సంఘం నూతన కమిటీ సభ్యులు

మోటకొండూర్, ఏప్రిల్ 27 : మండలంలోని అమ్మనబోలు గ్రామంలో గౌడ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బబ్బూరి మనోజ్, ఉపాధ్యక్షులుగా నల్లమాస మనోజ్‌కుమార్, ఆలేటి నవీన్, జనరల్ సెక్రటరీగా నల్లమాస ప్రవీణ్, సెక్రటరీగా బబ్బూరి మధు, కోశాధికారిగా శిగ సుధాకర్, కో ఆర్డినేటర్లుగా శిగ శ్రీనాథ్, కోల భాను, సోషల్ మీడియా కో ఆర్డినేటర్లుగా రంగు జహంగీర్, కోల భువన్, బాలాజీ, సభ్యులుగా మల్లం శ్రీనివాస్, శిగ సాయి, శివ దయాకర్, మాటూరి నాగరాజు, రంగు మహేశ్, ముఖ్య సలహాదారులుగా యావగాని వెంకటేశ్, నల్లమాస శివ, నల్లమాస మహేశ్, బబ్బూరి సాయినాథ్, కోల భరత్ ఎన్నికయ్యారు.



యాదగిరిగుట్ట : మల్లాపురంలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య



ఆలేరు టౌన్ : బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో సభకు తరలుతున్న గులాబీ శ్రేణులు



రాజాపేట : రఘునాథపురంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న పార్టీ నాయకులు

# ఊరూవాడ వరంగల్ బాట

- జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ రజతోత్సవాలు



ఆత్మకూరు(ఎం) : బహిరంగ సభకు బస్సులో వెళ్తున్న బీఆర్ఎస్ మండల నాయకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 27 : బీఆర్ఎస్ ఆవిర్భవించి 24వసంతాలు పూర్తయి 25వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా గులాబీ దండు తరలివెళ్లింది. అంతకు ముందు పార్టీ రజతోత్సవ వేడుకలను ఊరూరా ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద గులాబీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులు, అభిమానులు, ఆయా వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా వాహనాల్లో కేసీఆర్ సభకు తరలివెళ్లారు. ఆలేరు పట్టణంలోని బీసీ కాలనీ, భరత్‌నగర్ తదితర కాలనీల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పార్టీ జెండాలను ఆవిష్కరించారు. రాష్ట్రంలో సుస్థిర పాలన అందించడం కేసీఆర్‌తోనే సాధ్యమని ఈ సందర్భంగా అన్నారు.

## బీఆర్ఎస్ సభ చరిత్రలో నిలిచిపోతుంది

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్, ఏప్రిల్ 27 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణం నుంచి సభకు వెళ్తున్న బస్సులను ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ మాట వింటే గుండె ధైర్యం వస్తుందన్నారు. ఇందుకోసం పెద్ద ఎత్తున ప్రజలు సభకు తరలి వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



సంస్థాన్ నారాయణపురం : సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



బీబీనగర్ : కొండమడుగు గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణలో పార్టీ నాయకులు, కార్యకర్తలు



భువనగిరి కలెక్టరేట్ : తాజ్‌పూర్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న ఆ పార్టీ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్



మోటకొండూర్ : మండల కేంద్రం నుంచి బీఆర్ఎస్ బహిరంగ సభకు బయల్దేరుతున్న నాయకులు



బొమ్మలరామారం : తిమ్మాపురం గ్రామం నుంచి తరలి వెళ్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



తుర్కపల్లి : మోతీరాం తండా నుంచి రజతోత్సవ సభకు తరలి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



బీబీనగర్ : సభకు వెళ్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి. నాయకులు



వలిగొండ : లింగరాజుపల్లి నుంచి బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్తున్న గులాబీ శ్రేణులు



భువనగిరి అర్బన్ : పట్టణం నుంచి వరంగల్ సభకు తరలి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఆలేరు రూరల్ : కొలనుపాకలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జంగ స్వామి, నాయకులు



భూదాన్ పోచంపల్లిలో జెండా ఊపి వరంగల్ సభ బస్సును ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చౌటుప్పల్ రూరల్ : ఎల్లగిరి గ్రామ శాఖ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న నాయకులు



రామన్నపేట : వెల్లంకి గ్రామం నుంచి బీఆర్ఎస్ సభకు తరలి వెళ్తున్న పార్టీ నాయకులు, శ్రేణులు



అడ్డగూడూరు : కోటమర్తిలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న గ్రామ శాఖ అధ్యక్షుడు చిత్తలూరి నరేశ్



మోత్కూరు : పనకబండ గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్



ఆలేరు టౌన్ : వరంగల్ వెళ్తున్న బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య

## వాటర్ ప్లాంట్‌కు పరికరాలు అందజేత

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 27 : మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌కు అవసరమైన రూ.లక్ష విలువ గల పరికరాలను ఎల్లంల సంజీవరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ఆదివారం అందజేయగా స్థానిక నాయకులు, యువకులు పరికరాలను బిగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జన్నాయికొడె నగేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, మల్లేశం, నరేశ్, మురళీకృష్ణ, కిరణ్, కృష్ణమూర్తి, రాజు పాల్గొన్నారు.

### 'తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి'

వలిగొండ, ఏప్రిల్ 27 : మండలంలోని వలిగొండ, సంగెం, వర్కట్‌పల్లి, గోకారం, టేకులసోమారం గ్రామాల్లో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అకాల వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా కొనుగోలు చేయాలని కోరారు.

### ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయాలి : సీపీఎం

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 27 : మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం పేరుకు మాత్రమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని, నేటికీ ధాన్యాన్ని తూకం వేయలేదని అన్నారు. అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయిందని, వెంటనే తూకం వేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. సీపీఎం నాయకులు మంచాల మధు, మల్లారెడ్డి, రైతులు రాజగోపాల్‌రెడ్డి, ధనంజి, వెంకటేశ్, లింగస్వామి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

## కర్రెగుట్టలో నరమేధాన్ని ఆపాలి : పీవైఎల్



నిరసన తెలుపుతున్న పీవైఎల్ నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 27 : ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో గల కర్రెగుట్టలో కొనసాగుతున్న నరమేధాన్ని ఆపాలని, సాయుధ బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) పట్టణ కార్యదర్శి పగడాల శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతంలో హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా దాదాపు 20వేల మంది సాయిధ పోలీసు బలగాలు మూడు రోజులుగా జరిపిన కాల్పుల్లో 20 మందికి పైగా మావోయిస్టులు, ఆదివాసులు హతమైనట్లు వార్తలు వస్తున్నాయన్నారు. అమాయకులైన వారిని కాల్చి చంపి మావోయిస్టుగా చిత్రీకరించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క స్పందించి ములుగు, చర్ల ప్రాంతంలోని బలగాలను వెనక్కి పంపే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోరుగంటి ముత్యాలు, పోతగళ్ల నర్సింహ, సంతోష్‌కుమార్, సంజయ్, మహేశ్, సుమంత్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోటకొండూరు : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మోటకొండూర్, ఏప్రిల్ 27 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదిరెడ్డి, అంజిరెడ్డి, లక్ష్మయ్య, జనార్దన్ రెడ్డి, శ్రీనివాసచార్యులు, జయమోహనాచారి, బాలగంగాధర్‌రెడ్డి, వెంకటేశం, సత్యం, రాజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాయగిరిలో సిల్వర్ జూబ్లీ సమ్మేళనం

భువనగిరి కలెక్టరేట్ : పట్టణ పరిధిలోని రాయగిరి జిల్లా పరిషత్ పాఠశాల 1999–2000 పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు నాటి తీపి జ్ఞాపకాలను తోటి మిత్రులతో పంచుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు రంగయ్య, సాయిలు, చిత్తరంజన్‌రెడ్డి, రమేశ్‌ను సన్మానించారు.


## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

రాజాపేట, ఏప్రిల్ 27 : మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. పాల సొసైటీ మాజీ చైర్మన్లు ప్యాట రాజయ్య, తోట సత్తయ్య, మాజీ వార్డు సభ్యుడు జల్లపెద్దోళ్ల రమేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బోగ హరినాథ్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నీల బాలకృష్ణ, నాయకులు లేగల శ్రీలత, ఎడ్ల ఇంద్రారెడ్డి, బాలరాజు, సుమన్, గణేశ్, వినయ్, హరీశ్, భిక్షపతి, నర్సింహులు, రామచంద్రం, ఆంజనేయులు పాల్గొన్నారు.

## బీజేవైఎం నాయకుల రాజీనామా




సమావేశంలో మాట్లాడుతున్న రాజీనామా చేసిన బీజేవైఎం నాయకులు

బీబీనగర్, ఏప్రిల్ 27 : పట్టణానికి చెందిన బీజేవైఎం నాయకులు దేవరుప్పల పృథ్వీరాజ్, పెంచికల శివసాయిప్రసాద్, గోరుకంటి శివ కుమార్, ఆకుల సాయికుమార్ భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 10 సంవత్సరాలుగా బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ అభివృద్ధికి కృషి చేశామన్నారు. ప్రతిపక్ష పాత్ర పోషించడంలో బీజేపీ విఫలం అయినందున పార్టీకి రాజీనామా చేస్తున్నామని చెప్పారు. సిద్ధాంతాలను గాలికి వదిలేసి వ్యక్తిగత స్వార్థంతో పనిచేస్తున్న కొంత మంది తీరు నచ్చకనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.